# శిక్ష

సుమన్

"భార్గవ ఎవరూ ?" రామారావు అడిగాడు.

"అబ్బ. మీకు మతిమరుపు ఎక్కువై పోతోందండి. చెప్పానుగా నా క్లాసుమేటని. మన పెళ్ళికి వచ్చాడు." సరస్వతి చిరాగ్గా కనుబొమలు ముడిచి అంది. తన మతిమరుపుకు చిరాకు పడుతుందనుకున్నాడు రామారావు.

"ఊ - ఇక చెప్పు" అన్నాడు.

"ఏముంది. అతను ఎప్పుడూ నవ్విస్తూ వుంటాడు - నవ్వుతూ ఉంటాడు - హుషారుగా ఉంటాడు - అన్నిట్లోను ఫస్టే - కథలు కూడ ఏవో వ్రాస్తూ ఉండేవాడు."

"బొమ్మలేవీ గేసేవాడు కాదా ?"

"ఏవో గీస్తూనే ఉండేవాడు .... చక్కగా పాడతాడు కూడాను. కాలేజి సెక్రటరీ ఎలక్షన్లలో గెలిచాడు కూడాన్ను."

"హూ .... తరువాత ...."

"ఏముంది - మీరు కూడా అలా లక్షణంగా ఉండాలి - ఎప్పుడూ ఆఫీసు - ఫైళ్ళు - ఫైళ్ళ లెక్కలు - వీటిలోనే కాదు"

"అలాగే" అన్నాడు రామారావు తాపీగా.

సరస్వతి లేచి వెళ్ళి టేబిల్ మీది

ఫ్లవర్ వాజ్‌లో క్రొత్తపూలు పెట్టి సరి చేసి రేడియో ఆన్ చేసింది. రేడియో నుంచి సన్నని సంగీతం వినవస్తోంది. సరస్వతి ముఖం స్వచ్ఛంగా నవ్వుతో వెలుగుతోంది.

తనకూ సరస్వతికీ పెళ్ళయి సంవత్సరం కాలేదు. ఏదో మరీ నిన్న సాయంత్రమే అయినట్టుగా ఉంది. ఈ సంవత్సర జీవితంలో వాళ్ళిద్దరి మధ్య ఎక్కువ చోటు చేసుకుంది భార్గవ. భార్గవ ఎవరో, ఎలా ఉంటాడో రామారావుకి తెలియదు. అతను పెళ్ళికి వచ్చాడని సరస్వతి ఎన్నోసార్లు చెప్పింది. కాని రామారావు అతన్ని చూసినట్టు గుర్తులేదు. అతన్ని గురించి సరస్వతి రోజూ చెప్తుంది. అతను అందంగా ఉంటాడని - ఏవేవో కబుర్లు చెప్తాడని - ఆటగాడు-ఏదో చెప్తోంది- రామారావు పరధ్యానంగా ఏదో ఆఫీసు లెక్కల్లో తేలిపోతూ ఊకొడ్తాడు. మధ్యలో "భార్గవ ఎవరూ?" అని అడుగుతాడు. సరస్వతి భార్గవ ఎవరో చెప్పిన జవాబు సరిగా తన చెవిలో దూరకముందే మరో గొడవలో మునిగిపోతాడు.

కాని సంవత్సరం నుంచి భార్గవను గురించి తనకు బోధించుటలో భార్గవ అందంగా ఉంటాడని - అతను రోజూ లేవగానే బెడ్ కాఫీ త్రాగి - న్యూస్ పేపరు చదివి - అందంగా అలంకరించుకొని. కాడిలాక్ కారుమీద పోతాడని - ఎప్పుడైనా కారు చెడిపోయినపుడు హుందాతనానికి నడవాలనుకున్నప్పుడు - ఎత్తుగా ఉంటాడు కాబట్టి గంభీరంగా నడుస్తాడని-అతను నవ్వితే మరింత అందంగా ఉంటుందని రామారావు నిర్ణయించుకున్నాడు.

ఇవన్నీ అతనికి సరస్వతి చెప్పలేదు. రామారావు ఊహించుకున్నాడు.

"అయితే భార్గవను గురించి తనకు రోజూ ఎందుకు చెప్తున్నట్టు" రామారావుకు అనుమానం వచ్చింది.

వెంటనే అడిగాడు. "భార్గవ బి. ఎస్ సి. లో క్లాస్‌మేట్ అన్నావు కదూ మరి నీతో ఎలా ఉండేవాడు?"

"చాల సోషల్‌గా ఉండేవాడు. చాల మంచివాడు కూడా నండీ."

"అలాగా"

రామారావుకి ఏదో అసంతృప్తి బయలుదేరింది. కనుబొమలు అనేకసార్లు ముడిపడ్డాయి. ముఖం మీద వేళ్ళతో అనేకసార్లు రుద్దుకున్నాడు. కుర్చీలోనుంచి లేచి వెళ్ళి మంచం మీద వెల్లకిలా పడుకొని ఇంటి కప్పుకేసి చూస్తూ అనుకున్నాడు తనలో ఏదో అగాధం చేసుకొంటోందని.

వెంటనే అతనికి అనేక దృశ్యాలు కనపడ్డాయి. సరస్వతి రోజూ భార్గవను గురించి మాట్లాడుతుంది. అలా మాట్లాడేప్పుడు ఆమె చెక్కిళ్ళమీద - పెదవులమీద ఏదో వెలుగు వుంటుంది. కళ్ళు మిల మిల లాడతాయి ఆమె పాలభాగం ఏదో గతచరిత్ర స్మృతులు ముందుకు లాక్కొటానికి ప్రయత్నం

చేస్తున్నట్టుగా ఉంటుంది. "హుఁ" అనుకున్నాడు.

ప్రక్కకు తిరిగి ఏర్పడుతున్న అగాధానికి మరింత చక్కటి దారి వేశాడు.

● ● ●

కాఫీ సిప్ చేయసాగాడు రామారావు. మొదట గుక్క త్రాగాడో లేదో - వంట యింటిలో నుంచి "మహాశయా! కాఫీ ఎలా వుంది?" అని నాటక ఫక్కీలో అంది సరస్వతి.

నీ చేతి వెధవ కాఫీ త్రాగించటం ఒకటి కాకుండా అది చాల చక్కగా రుచిగా వుందని అబద్ధం కూడా చెప్పించాలి - వెధవ బ్రతుకు అనుకున్నాడు మనసులో -

"ఏమిటండీ మాట్లాడరు - కాఫీ త్రాగేప్పుడు కూడ ఆఫీసు లెక్కలే వేస్తున్నారా?" అంటూ సరస్వతి రామారావు దగ్గరకు వచ్చింది.

"చాల బాగుంది" అన్నాడు రామారావు.

"మరేం లేదు - అదే ఆ ముఖం చెప్పటంలేమ చిట్లించుకొని" - అంటూ బుగ్గమీద చిటిక వేసి గడ్డంమీద వేలితో గుండ్రంగా నిమురుతూ కళ్ళు చిలిపిగా కదిపింది. తరువాత కిటికీ క్రింద తలుపులు తీసి అందులో వస్తున్న కిరణాలలో అరచేతులు వుంచి అంది. "అబ్బ - వేడిగా వున్నాయి - మీలాగ" అంటూ రామారావు వరకు ఎగిరి దూకి మెడచుట్టూ చేతులు వేసింది. అలా అన్నపుడు సరస్వతి కళ్ళలో తియ్యటి దృశ్యాలు రామారావు గమనించక పోలేదు.

"ఏమిటలా ఆలోచించుతున్నారు. రాత్రి నాకు ఒక కల వచ్చింది చెప్పనా?"

"ఊఁ" అన్నాడు రామారావు.

"మనిద్దరం చక్కగా - హాయిగా చేయి చేయి పట్టుకొని ఒక అందమైన తోటలో వెళ్తున్నాము. పైన మబ్బులు చాలా అందంగా వున్నాయి. ఎత్తుగా పెరిగిన చెట్లు - క్రింద పచ్చగడ్డి మరింత బాగుంది.

"ఇంతకీ నీ కల టెక్నికలరా - బ్లాక్ అండ్ వైటేనా?" మధ్యలో అడిగేసరికి సరస్వతి చిరుకోపంతో "మీ రెప్పుడూ యింతే" అంటూ రుసరుస లాడుతూ వంట యింటిలోకి వెళ్ళింది. మరొకప్పుడయితే సరస్వతి అలా ఇంకోసారి నడిస్తే చాలు అనుకొనేవాడు - నడుము అటూ ఇటూ ఊగుతూ వెళ్తావుంటే రామారావుకి మరోసారి చూడబుద్ధి అయ్యేది. కాని యిప్పుడు చూడబుద్ధి కావటంలేదు.

కుర్చీలో కూర్చొని వంటగదిలోకి చూశాడు. కత్తిపీట ముందు వేసుకొని సరస్వతి కూర తరుగుతోంది. తల వంచుకొని ఎక్కడో ఆలోచించుతూ వున్నట్టుగా కనబడింది రామారావుకి.

ఆ సమయంలో సరస్వతి ఒక కాలు మడత పెట్టి కత్తిపీటమీద వుంచి రెండో కాలిమీద ముఖం ఆన్చి ఉంది.

చాల అందంగా ఉంది. పైట ప్రక్కగా తొలగి బలంగా దృఢంగా వున్న అవయవ సంపదతో కనిపించుతూంది. జాకెట్టుకీ చీరకీమధ్య జానెడు వెడల్పు పొట్ట నడుమ తెల్లగా సన్నగా మెత్తగా వుంది.

మరోసారి అయితే రామారావు ఆమెను చాలా గంటలు చూసేవాడు. ఇపుడు చూడబుద్ధేయలేదు. పైగా దీనికి దేవుడు ఇంత అందం ఎందుకిచ్చాడు. దీన్ని చాకుతో కోస్తే - బుగ్గలమీద అక్కడక్కడా గిచ్చితే - అలా అనుకున్నాడు.

మళ్ళా వెళ్ళి సరస్వతిని చూడకుండా కూర్చొని అనుకున్నాడు. "ఏ భార్గవగాడి గురించో ఆలోచిస్తూ ఉంటుంది. వాడితో తిరిగిన తిరుగుళ్ళు, షికార్లు వాడి చెంపలు నిమిరిన గుర్తులు అన్నీ జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉంటుంది. పైగా కల అట - ఆ కలలో కూడ భార్గవగాడే ఉండి ఉంటాడు. నన్ను చెబుతుంది కాని" అనుకున్నాడు రామారావు.

కొందరు అందమైన సంఘటనలు కథలుగా చెప్పగలరు. అందులో మనుష్యులు ఎవరి గురించి చెబుతారు. ఆ మనుష్యులలో తను కూడ ఉండి ఆ కల గురించేచెప్తున్నామని ఎదుటివాడికి తెలియకుండా తమ కల్పనాశక్తికి







మెచ్చుకుంటూ వుంటారు.

కొంచెంసేపు గదిలో అటు ఇటు తిరిగాడు. మధ్య మధ్యలో వంట గది లోకి తొంగిచూశాడు సరస్వతి ఏం చేస్తుందోనని. సరస్వతి అలాగే మొదటిసారి కనపడ్డట్టే కనపడేసరికి చిరాకు ముంచుకొచ్చింది. కోపం కట్టలు తెంచుకుంది - మనసులో అను కున్నాడు ! నేనేమీ వెర్రి వెధవాయిని కాను - నీ మాటలకు మోసపోయి, కరిగిపోయి నీకు కుక్కలా ఉండ టానికి నేను ఆత్మాభిమానం-ఆలోచన ఉన్న మగవాణ్ణి.

తరువాత రామారావు వంట గది లోకి వెళ్ళి సరస్వతి ప్రక్కన పీట వేసుకు కూర్చుంటూ "ఏమిటి ఆలో చిస్తున్నావు ?" అని అడిగాడు.

"ఏమీలేదు - మిమ్మల్ని గురించే - రాత్రి మీరు కలలో భలేగా వున్నా రండి" అంది సరస్వతి.

"ఇవాళ అయ్యగారికి వంట గది మీద మోజు పడిందేమిటి" అంది బుగ్గ గిల్లుతూ -

రామారావు మాట్లాడలేదు.

తరువాత గిల్లినచోట నిమురుతూ "చూడండి ఎలా కందిపోయిందో -

అయ్యో అలా బిక్కముఖం పెట్టేశా రేమిటి - నొప్పి పుట్టిందా - ఇంకె ప్పుడు గిల్లనులే. మా చిట్టివి కదూ - ఏడవకు - మా బంగారు కొండవి కదూ ?" రామారావుకి నవ్వు రాలేదు.

"మీరు కూరలు తరుగుతూవుండండి. నేను అన్నం వండేస్తాను మా చిట్టి బాబువి కదూ !"

రామారావు మౌనంగా వున్నాడు.

అసలు ఆ రోజుల్లో మగవాళ్ళు వంట చేస్తున్నారు. అదొక ఫాషనై పోయింది మగవాళ్ళకి-నేను మిమ్మల్ని సగం వంటే చేయమంటున్నాను. మా వెండి ముద్దవు కదూ" అంటూ రామారావు రెండు బుగ్గలూ గిల్లుతూ ముఖం మీద పడిన వెంట్రుకల్ని పైకి తోసింది.

రామారావు ఇంకా మాట్లాడలేదు.

ముఖం గంభీరంగా ఎర్రబడి ఉంది. కళ్లు సరస్వతిలో ఏమో వెదుకు తున్నాయి.

"ఏమిటి సీరియస్ - ఇది ఆఫీసేమిటి -" అంటూ రామారావుని పీట మీద నుంచి మోచేత్తో క్రిందికి త్రోసింది.

మళ్ళా పీటమీద కూర్చొని బొంగురు పోయిన కంఠంతో అన్నాడు "రాత్రి కలలో భార్గవ కూడ కనబడ్డాడా ?"

ఉలిక్కిపడి చూసింది సరస్వతి-చకచక రామారావు ముఖంలో భావాలు వెదికింది. వెంటనే ఆమె ముఖం ఎర్రబడింది. కళ్ళల్లోనుంచి నీటి బిందువులు బొట బొట రాలాయి. మోకాళ్ళలో ముఖం దాచుకొని అలాగే వుండిపోయింది. కన్నీళ్ళతో మోకాళ్ళ మీద నున్న పలుచటి చీర తడిసి పోయింది.

"నువ్వు నిజం చెప్తావని నేను అడుగలేదు. నువ్వు నిజం చెప్పవు. నువ్వు మోసగత్తెవి. నన్ను మోసం చేశావు."

సరస్వతి తలెత్తి రామారావు వంక చూసింది. ఎర్రబడిన కళ్ళల్లో నుంచి నీళ్లు బిందువులుగా జలజలా కారుతున్నాయి.

సరస్వతి మాట్లాడాలని నోరు కదిపింది కాని ఉప్పొంగిన దుఃఖం ఆమెను మాట్లాడనీయలేదు. లేచి చకచక పరుగెత్తుకుంటూ వెళ్ళి మంచం మీద పడి దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

రామారావు అక్కడే కూర్చున్నాడు. కొంచెం సేపటికి యిల్లంతా గంభీరం వహించింది. కేవలం పొయ్యిమీద ఉడుకుతున్న బియ్యపు మోత మాత్రం వినబడుతోంది.

రామారావు అక్కడే కూర్చొని అనుకొన్నాడు. "సరస్వతీ - నువు మారుతున్న ఈ లోకం నాగరికను నీ యింటి కిటికీలో నుంచి చూస్తూ నువ్వు కూడ అందులోకి వెళ్ళాలని ప్రయత్నించే ఆడదానివి. చెక్కిన కలర్

డ్యూయట్‌లు సినిమాల్లో లాగా నాతో పాడాలనుకొని కన్నెగా కలలు గని ఉంటావు. కానీ ఈ గుమాస్తాకి అంత తీరికలేదు. నీ భర్త భార్గవలానో లేక దేవానంద్‌లానో ఉండాలని కలలుగని ఉంటావు. కాని నేను అంత అందంగా లేను. ఉన్నానని అబద్ధం చెప్పక ఏమి చేస్తావు ?"

● ● ●

సాయంత్రం ఆఫీసునుంచి వస్తూనే యింటిలోకి అడుగు పెట్టగానే రామారావు చేతికి కాఫీ కప్పు అందించింది. ఒక్క గుక్క త్రాగి "ఏమిటి యిది కాఫీనా - మునిసిపాలిటీవాళ్ళ పంపు నీళ్ళా. ఏమిటి దాని నిండా నలికలు - మసి-"

విసురుగా టీపాయ్‌మీద పెట్టాడు. అలా పెట్టటంతో కప్పులో కాఫీ కాస్త వలికింది. దానివంక చూస్తూ బిక్కముఖం వేసుకొని నిలబడింది సరస్వతి.

"అసలు నీకు మనస్సు దగ్గర వుందా ? ఏ భార్గవగాడి గురించైనా ఆలోచిస్తున్నావా ? వాడితో తిరిగిన తిరుగుళ్ల గురించి కలలు కంటూ కాఫీ గాచి వుంటావు-"

"లేదండీ బాగానే కాచాను "

"ఏమిటి, బాగా కాశావా? మొగుడి వెధవ కదా అని దబాయించటం నేర్చుకున్నావు - ఒకవేళ యిది భార్గవ గాడికి అమృతంలా ఉండి ఉండవచ్చు. కాని నేను అటువంటి జులాయి వెధవను కాను - నీ చూపులు-నీ వయ్యారం-నీ నడక-నీ అందం చూసి నిన్ను పొగుడుతూ నోరు చప్పరించుకోటానికి భార్గవలాగా వెర్రి కోతిని కాను."

సరస్వతి బొట బొట కన్నీళ్లు జారుతూ వుండగా ముఖాన్ని చేతులతో కప్పుకొని వంటింట్లోకి తూలుతూ వెళ్ళిపోయింది.

మళ్ళా లోపలి నుంచి వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం వినిపించింది.

● ● ●

"ఏమిటి ఈ కూర ? యిందులో ఏమైనా ఉప్పు తగలేశావా?" పళ్లెంలో వున్న కూర నేలకేసి కొట్టి అరిచాడు రామారావు.

"మరచిపోయానండి" అంది బెదురుతూ సరస్వతి.

"అవును మరచిపోతావే. నువ్వు మరచిపోక ఏం చేస్తావు - అసలు ఇంకా కొన్ని రోజులకు నీకు మొగుడనే వాడున్నాడని కూడ నీకు గుర్తు వుండదు."

"అది కాదండి."

"ఏది కాదు నీ ముఖం" సరస్వతి ముఖంలోకి చూశాడు. తల చిందర వందరగా వుంది. ముఖాన చెమట పట్టి బొట్టు నుదురంతా ఎర్రగా కమ్మింది. పాత చీర కట్టుకొని వుంది. దానికి అక్కడక్కడ చిరుగులు వున్నాయి.

"ఏమిటి ఈ వేషం - నన్నే కాకుండా నిన్ను కూడా మరచిపోయేంత వరకూ వచ్చావన్న మాట.

ఓ-యిది మానసిక ఆరాధన కాబోలు- ఆ భార్గవగాడు-నీకు కలలో కనబడి నీ ఆరాధన గ్రహించి వరాలు ఇస్తాడు గాబోలు."

"మీరు అనుకున్నట్టుగా నేను నీచు రాలిని కాను. నాకు ప్రాణం వుంది - శీలం వుంది."

"సరస్వతీ-నేను ఎవరిని అను కున్నావు. ఏదో ఆఫీసు కాగితాలలో మునిగిన రామారావుని కాను. నీలాంటి ఆడవాళ్ళను చాలమందిని స్టడీ చేశాను. నీ డబాయింపులు - ఏడ్పులు నేను నమ్మను. నీకు ఆ భార్గవగాడికి ఏ సంబంధం లేదంటే నేను నమ్మను - జీవితంలో ఎప్పటికీ నమ్మను."

"భగవాన్! మీకు నేను ఏ రకంగా చెప్పను ?" అని సరస్వతి వెక్కి వెక్కి ఏడుస్తూ తల గోడకేసి కొట్టు కొని తరువాత చాపమీద పడుకొని కుళ్ళి కుళ్ళి ఏడవసాగింది.

రామారావు ఆమెను చూస్తూ అను కున్నాడు."సరస్వతీ-నువ్వు ఆడదానివి. నీ పేరు పురాణాలలోఓ పతివ్రత పేరు. నీ చుట్టూ చాలా సంఘం వుంది జీవి తంలో చాకుల్లాటి నియమాలు ఉన్నాయి. నిన్ను విమర్శించాలనే చుట్టూ మను షులు వేయికళ్ళతో కాపలా కాస్తు న్నారు. మన మతం, సంస్కృతి నీకు ఎన్నో నీతులు, నియమాలు చెప్తు న్నాయి. నీకు కొన్ని శతాబ్దాల ముందు అనేకమంది స్త్రీలు నీకు మంచి రోడ్లు వేసి వుంచారు. చదువు నీకు సంస్కా రం నేర్పడానికి ప్రయత్నించుతోంది- సైన్సు రోజూ నీ కోసం గుక్కతిప్పు కోకుండా నిన్ను అభివృద్ధిలోకి తీసుకు వెళ్ళాలని-ఈ ప్రపంచాన్ని నీకు చూపా లని కృషి చేస్తోంది - చుట్టూ అనేక సంఘ వ్యవస్థలు నీకు కోటగోడల్లా నిలచి వున్నాయి - అయినా నువ్వు వీటన్నిటి నుంచి తెలివిగా తప్పుకొని భార్గవతో తిరగగల్గావు. పైగా వాటిని నీతికథల్లాగా నాకు చెప్పసాగావు - నీ తెలివికి నా జోహార్లు - సరస్వతీ - నా జోహార్లు -"

బహుశా అది ప్రేమ అనుకొని ఉంటావు ఒక ఆడదానికి మగాడికి మధ్య ఉన్న కుతూహలం ప్రేమ ఎలా అవుతుంది ? కుతూహలం. అంతే - అది పండితే కామం.

● ● ●

మరునాడు రామారావు ఆఫీసుకు వెళ్ళిన తరువాత భోజనం చేస్తూ వుండగా పోస్టుమాన్ వచ్చి తలుపు తట్టాడు సరస్వతి తలుపు తీసి కవరు అందుకొని చూసింది. పైన తన అడ్రసు ఉంది. చింపి లోపల వున్న కాగితాన్ని చదివి నిర్లిప్తంగా మళ్ళా ఉంచింది. ఆమె హృదయం యేదో ఆలోచించసాగింది.

సాయంత్రం విసురుగా వచ్చి కూర్చున్నాడు రామారావు వస్తూనే అడిగాడు. "నాకు ఏమైనా ఉత్తరాలు వచ్చాయా ?"

సరస్వతి వచ్చి ఓ కవరు టీపాయ్ మీద పెట్టింది. సరస్వతి ముఖంలోకి



చూశాడు రామారావు ముఖం ఎర్రగా కంది ఉంది. కనురెప్పలు ఉబ్బి ఉన్నాయి. కన్నీటి చారలు ముఖం మీద కనబడుతున్నాయి.

కవరు లోగల కాగితం మడత విప్పుతూ అన్నాడు. "ఏమిటా ముఖం? నేను యింటికి వచ్చేసరికి ఏడ్పు ముఖం పెట్టావు. నేను లేకుంటే హాయిగా వుంటావు."

సరస్వతి ఏమీ మాట్లాడ లేదు. అలాగే నేలకేసి చూస్తూ నిలబడింది.

రామారావు ఉత్తరం చదవ సాగాడు. అందులో యిలా ఉంది.

"డియర్ సరూ!

ఎవరు పిలిచారో గుర్తువచ్చారా?

నేను నీ భార్గవని. పెళ్ళి చేసుకొని హాయిగా కాపురం చేస్తున్నావు. ఇక్కడ నేను చస్తున్నాను. ప్రేమంటే ఏమిటో నువ్వు దూరం అయిపోయిన తరువాత ఇంకా బాగా తెలుస్తోంది. రాత్రులు నిద్ర పట్టటంలేదు. రోజూ పిచ్చి పిచ్చి కలలు - ఆలోచనలు- పిచ్చెక్కిపోతు న్నట్టుగా ఉంది.

నువ్వు దూరం అయిపోయిన తరువాత త్రాగుడు మొదలుపెట్టాను. త్రాగిన కాసేపు మరచిపోగలను. కాని తరువాత?

నీకెప్పుడైనా మన షికారులు - సినిమాలు గుర్తుకు వస్తాయా? అవి నా హృదయ ఫలకం మీద తియ్యటి ముద్రలు సరూ! వాటిని జీవితంలో ఎప్పటికీ చెరపలేను -

పెళ్ళి చేసుకున్నావ్ కదూ! పెళ్ళి నీకు సుఖం ఇస్తోందా? పెళ్ళంటే ఏమిటి? ఒకరికి ఆన్నీ అమ్ముకోటం- అలా వదిలేయ్.

యిప్పుడు ఈ ఉత్తరం మీ ఆయన చేతులలో పడకుండా వుండాలని వ్రాస్తు న్నాను. పదింటికి ఆఫీసుకు వెళ్ళిన తరువాత పోస్టుమాన్ వస్తాడని - నీకే అందిస్తాడని వ్రాస్తున్నాను. మరి నాకు జవాబు వ్రాయవూ?

ముద్దులతో
భార్గవ"

ఉత్తరం పూర్తిగా చదివి సరస్వతి ముఖంమీద విసిరి కొట్టాడు. "చూడు ఆ భార్గవకు నీకు ఏ సంబంధం లేద న్నావుగా. ఈ ఉత్తరం ఏమంటావ్!"

సరస్వతి జావురుమని బిగ్గరగా ఏడుస్తూ రామారావు కాళ్ళమీద పడి పోయి అంది. "నాకేమీ తెలియదండి. యిది ఎవరో మన సంసారాన్ని నాశ నం చేయటానికి పన్నిన పన్నాగం."

"ఈ ప్రపంచంలో మన సంసా రం నాశనం చేయటమే తప్ప వాడికి మరేమీ పని లేదంటావు! అసలు ఎవరో వ్రాస్తే భార్గవ పేరు వాడికి ఎలా తెలుస్తుంది."

సరస్వతి ఏమీ మాట్లాడలేక పోయింది. అతని కాళ్ళమీద పడి వెక్కి వెక్కి ఏడుస్తోంది. కారుతున్న కన్నీళ్ళతో ఆరామారావు పాదాలు తడిసి పోతున్నాయి. తల మాటి మాటికి పాదాలకేసి-నేలకేసి కొట్టుకోసాగింది-

"భగవాన్ - నేను ఏమి నేరం చేశాను. నన్ను ఈ జన్మలో యిలా శిక్షించుతున్నావు. తియ్యటి కాపురంలో నిప్పులు పడ్డాయి - యిక నేను బ్రతకను - బ్రతికలేను."

రామారావు స్థిరంగా కూర్చున్నాడు.

సరస్వతి యింకా అంటోంది. "భార్గవతో మీరనుకున్న నీచసంబంధం లేదండి. నన్ను, నా శీలాన్ని నమ్మండి."

తరువాత సరస్వత లేచి రామారావు ఒడిలో తలపెట్టి అంది. "మిమ్మల్ని నేను ఎంత ప్రేమిస్తున్నానో నాకు తెలుసు. ఆ భగవంతునికి తెలుసు. మీరు భర్తగా దొరకటం నా అదృష్టం అనుకున్నాను. నన్ను యిలా చిత్రహింస చేయటానికి నేనేం పాపం చేశాను. నన్ను చచ్చిపోనివ్వండి. నేను బ్రతికి వ్యర్ధం."

"మరి ఉత్తరంసంగతేమిటి?" కనుబొమలు చిట్లించిఅడిగాడు రామారావు.

"అది నాకు తెలియదండి. నన్ను నమ్మండి-ఇటు చూడండి - నా కళ్ళల్లోకి చూచి చెప్పండి- నేను పవిత్రురాలినో - అపవిత్రురాలినో నా ముఖం చూసి చెప్పండి."

రామారావు ముఖం చూడకుండా ప్రక్కకు తిరిగాడు.

"ఈ నాటికి నాముఖం పాప పంకిలమై పోయింనన్నమాట. నేను ఒక్క క్షణం లేకపోతే బ్రతకలేని మీకు నేను అంత రాక్షసినై పోయానన్నమాట - నా కళ్ళళ్ళోకి చూసి చెప్పండి - నన్ను చచ్చిపొమ్మని అజ్ఞాపించండి."

సరస్వతి రామారావు ముఖాన్ని తనవైపుకు త్రిప్పుకుంది. రామారావు సరస్వతి కళ్ళళ్ళోకి చూశాడు. కళ్ళు ఎర్రగా నిప్పుల్లా ఉండి వెచ్చటి కన్నీళ్ళు రాలుతున్నాయి కొంచెం సేపు ఆమె కళ్ళళ్ళోకి చూసి లేచి నిలబడ్డాడు. సరస్వతి అతని కాళ్ళమీద వాలిపోయింది. వాలిపోయిన సరస్వతిని వంగి భుజాలను పట్టుకొని నిలబెట్టాడు. దగ్గరగా లాక్కొని గట్టిగా కౌగలించుకున్నాడు. చాలసేపు వీపు నిమిరాడు. ముఖంమీద పడ్డ వెంట్రుకలను పైకి త్రోసి ఆమె చెంపలకు తన చెంపలను ఆన్చి కన్నులు మూసుకొని చాలసేపు ఉండిపోయాడు. సరస్వతి అతని గుండెలలో గువ్వగా ఒరిగిపోయింది. మళ్ళా కొంచెం సేపటికి తేరుకొని సరస్వతి కళ్ళ నీళ్ళని తుడిచి భుజం తట్టి తన గదిలోకి వెళ్లి అనుకున్నాడు. "ఆ కన్నీళ్ళను - ఏడ్పునీ నమ్మి నీకు బానిసవ్వటానికి నేను వెర్రి వెంగళాయిని కాను" అని.

మరునాడు సాయంత్రం రామారావు రైల్వే స్టేషన్‌లో బుక్‌స్టాలులో పుస్తకాలు చూస్తున్నాడు.

అప్పుడే వచ్చిన రైలు నుంచి దిగిన జనాలు బిల బిలమంటూన్నారు. అరుపులు - కేకలు వినబడటంలేదు రామారావుకి. బుక్‌స్టాలులో పుస్తకాలు చూస్తున్నాడు. అక్కడ

పతివ్రతల కథల పుస్తకాలు యేమీ లేవు. అన్నీ సెక్స్ పుస్తకాలు - ప్రేమ కథలు - పైగా వాటిమీద గుడ్డలు ఉండీ ఉండనట్టుగా ఉన్నాయి. 'నాన్సెన్స్' దేశం చెడిపోయింది అనుకున్నాడు.

సరస్వతి కూడ యిటువంటి పుస్తకాలు చదివి వుంటుందా ? తప్పకుండా చదివి వుంటుంది.

లేకపోతే భార్గవగాడితో ఆ ప్రేమాయణం ఎలా జరుపుతుంది. అసలు మనుషుల్ని సగం చెడగొట్టేది ఈ పుస్తకాలే —

ఆ పుస్తకాలు సరస్వతి కూడ చదివి వుంటుంది అనుకొనే సరికి రామారావుకి చిర్రెత్తుకొచ్చింది. వాటిని చింపేయాలనుకున్నాడు-అగిపుల్ల పెట్టి వాటిని కాల్చివేస్తేనో.

ఇంతలో ఎవరో భుజంమీద చేయి వేసి తట్టారు. వెనక్కి తిరిగి చూశాడు రామారావు. ఎత్తుగా వున్న ఓ వ్యక్తి నిలబడి వున్నాడు. ఎర్రటి ముఖం - మెలికలు తిరిగిన జుట్టు - కవ్వించుతూ పెద్దవిగా ఉన్న కళ్లు-టక్ చేసి అందంగా ఉన్నాడు. చేతిలో బ్రీఫ్ కేస్ ఉంది.

అర్థం కానట్లు చూశాడు రామారావు. "ఐయామ్ భార్గవ - మీ పెళ్ళికి వచ్చాను. మీరు సరిగా నన్ను చూడలేదనుకుంటా అప్పుడు" అన్నాడు రామారావు చేతిని చేతిలోకి తీసుకొని నొక్కుతూ.

రామారావు శరీరం ఒక్కసారి "ఎర్తు క్వేక్" ఇచ్చినట్లయింది. తమాయించుకొని నిలబడి తన చేతిలో ఉన్న చేతిని గట్టిగా నొక్కుతూ "గ్లాడ్ టూ మీట్ యూ" అన్నాడు.

కొంచెం సేపటికి రామారావు అడిగాడు "ఏమిటి యిలా వచ్చారు?"

"ఈ ఊళ్ళో ఉద్యోగం వచ్చింది. రేపు జాయినవ్వాలి." రామారావు నెత్తిమీద ఏవో బండరాళ్లు ఒక్కొక్కటే పెరుగుతూ తనను క్రిందకు నొక్కేస్తున్నట్టుగా ఉన్నాయి.

"సరస్వతి ఎలా ఉంది" అడిగాడు భార్గవ.

"చాలా బాగా ఉంది" అన్నాడు భార్గవ ముఖంలోకి చూస్తూ.

స్టేషను బయటకు వచ్చిన తర్వాత భార్గవ అన్నాడు. "ఈ ఊళ్ళో మంచి హోటలు ఏదైనా వుంటే చెప్పండి. నాలుగు రోజులు పోయిన తరువాత ఎక్కడైనా ఓ గది అద్దెకు తీసుకుంటాను,"

రామారావు కొంచెంసేపు ఆలోచించాడు. ఆలోచించుతున్నంతసేపు అటు యిటు చూశాడు. తరువాత చేతితో వెంట్రుకలను పైకి త్రోసుకుంటూ అన్నాడు. "మేము యిక్కడ ఉండగా మీరు హోటలులో ఉండటమా? వద్దు. గది దొరికేవరకు మా యింటిలోనే ఉండండి."

భార్గవ మొట్టమొదట ఒప్పుకో

లేదు. కాని రామారావు అతన్ని బల వంతంగా ఒప్పించాడు.

భార్గవ ఓ రిక్షా పిలిచాడు. ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు. భార్గవ ఏవేవో కబుర్లు చెప్తున్నాడు. వాటికి ఊకొడు తున్నాడన్నమాటే గాని ఆలోచనలు ఎక్కడో ఉన్నాయి. చాల గంభీరంగా ఆలోచించుకున్నాడు. అతని మనసు యేదో గ్రాఫు గీస్తోంది. అతని మనసు గీసే గీత చాల వంకరలు తిరిగి పైకి పెగుగుతూ, క్రిందకు తిరుగుతూ అనేక ఆకారాలు వస్తోంది. ఆ గీత అతని మనస్సులో ఎర్రగా ఉంది. దానికి ప్రాణం వచ్చి మాట్లాడుతున్నట్లుగా కూడ ఉంది అప్పుడప్పుడు.

రిక్షా యింటిముందు ఆగింది.

బయట గేటు దగ్గర ఉండగానే కేక పెట్టాడు రామారావు "సరస్వతీ! భార్గవ వచ్చాడు."

కొన్ని నిమిషాలలో సరస్వతి పైట కొంగుకు చేతులు తుడుచుకుంటూ బయటకు వచ్చి భార్గవ ముఖంలోకి చూసి అంది. "ఇప్పుడేనా రావటం"

"అవును" అన్నాడు భార్గవ.

సరస్వతి తరువాత "లోపలకు రండి." అని వెనక్కి తిరిగి వెళ్ళి పోయింది. సరస్వతి భార్గవ ముఖం లోకి చూసినపుడు రామారావు సర స్వతి ముఖాన్ని పరీక్షించాడు. ఆ ముఖంలో యేమైనా సంతోష రేఖలు కనబడతాయేమోనని - ఎన్ని రోజు లకో తిరిగి కలుసుకున్నప్పుడు పొంగే ఆనందం కనబడుతుందేమోనని నిశి తంగా పరిశీలించాడు.

కాని ఎక్కడా కనబడలేదు.

ఇంతకుముందు నుంచి బిగించ బడిన ముడులు మెదడులో కొంత సడలు యిచ్చినట్టయింది రామారావుకి.

భార్గవ కుర్చీలో కూర్చున్నాడు. రామారావు వంట గదిలోకి వెళ్ళాడు. అక్కడ పొయ్యి ముందు కూర్చొని కూరలు తరుక్కుంటుంది సరస్వతి.

"ఇదేమిటి యిక్కడ కూర్చున్నావ్ కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళు - సోప్ యివ్వు. భార్గవకు కూడ వంట చేయి. ఈ ఊళ్ళోనే ఉద్యోగం వచ్చిందట. గది దొరికేవరకూ ఇక్కడే ఉంటాడు"

ఎందుకూ అని అడగలేదు సర స్వతి. రామారావు ముఖంలోకి కూడ చూడలేదు. "ఎందుకు తీసుకువచ్చారు. యే హోటల్లోనైనా ఉండమనక పోయారా? నేను ప్రతి రాళ్ళకు ఇక్కడ వండి పెట్టలేను." అందితగ్గు స్వరంతో.

రామారావు యేమీ మాట్లాడలేదు. అక్కడే నిలబడిపోయాడు. సరస్వతి లేచివెళ్ళి భార్గవకు సబ్బు యిచ్చి బాత్ రూమ్ చూపించటానికి వెళ్ళింది.

ఆ కాసేపు రామారావు చెవులు రిక్కించి ఉన్నాయి. యేమైనా మాటలు వినబడతాయేమోనని-యేమీ వినబడ లేదు. ముందు బాత్‌రూము తీసిన చప్పుడు వినిపించింది. వెంటనే సర స్వతి వంట గదిలోకి వచ్చేసింది.

"నాకు ఒంట్లో బాగాలేదు. అయినా మీరు నన్ను శిక్షించదలచుకున్నారు. నేను బ్రతకటం మీకు యిష్టం లేదు. ఆ సంగతి నాకు తెలుసు."

రామారావు ఏమీ మాట్లాడకుండా డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి కూర్చున్నాడు. వెంటనే భార్గవ కూడ టవలీతో తుడుచుకుంటూ వచ్చి మరో కుర్చీలో కూర్చున్నాడు. రామారావు మనస్సు కాస్త తేలికగా ఉంది. ఇంతకు ముందు ఉన్న బరువు, విషాదం ఇప్పుడు లేవు ఎందుకని?

వంట గదిలో నుంచి గిన్నెల మోత వినిపించుతోంది. దానిని బట్టి సరస్వతి తన పనిలో తాను మునిగిపోయిందని అనుకున్నాడు రామారావు. భార్గవను గురించి అంత ఎక్కువగా మాట్లాడేది. ఎప్పుడూ వాడిని గురించి కబుర్లు చెప్పేది. వాడు కనబడగానే ముఖం మాడ్చుకొని తప్పించుకు తిరుగుతోంది.

తను సరస్వతి విషయంలో పొరబడలేదు గదా? భోజనం అయిన తరువాత సరస్వతి - రామారావు - భార్గవ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నారు. భార్గవ ఏవో కాలేజి కబుర్లు చెప్తున్నాడు. తను వింటున్నాడు. సరస్వతి వీక్లీ చూస్తోంది. వినడం లేదని తెలుస్తోంది రామారావుకి.

వాళ్ళిద్దరిని అక్కడే వదలి తనగదిలోకి వచ్చాడు రామారావు. మంచం మీద పడుకున్నాడు కాని చెవులు మాత్రం డ్రాయింగ్ రూమ్ కేసి పని చేస్తూన్నాయి. రెండు నిమిషాల వరకు అక్కడి నుండి ఏ మాటలు రాలేదు. మరో రెండు నిమిషాల తర్వాత సరస్వతి లోపలకు వచ్చింది.

"ఏమిటి నిద్రపోతున్నారా? అతను అక్కడే కూర్చున్నాడు. మీరు ఎపుడు వచ్చింది నేను చూడలేదు. పత్రికలో మునిగిపోయాను."

"మీ రిద్దరు మాట్లాడుకొంటూ ఉండండి. నాకు నిద్ర వస్తోంది.

"నాకూ నిద్ర వస్తోంది. అతన్ని



వెళ్ళి పడుకోమని చెప్పండి."

ఇక రామారావుకి లేవడం తప్ప లేదు. వెళ్లి భార్గవకి ఎదురుగా కూర్చు న్నాడు. భార్గవ ఏవో కబుర్లు చాల ప్రొద్దుపోయే వరకు చెబుతూ నే ఉన్నాడు. ఎక్కువగా అవి కాలేజి జీవితానికి సంబంధించినవి. ఆ కబుర్లలో రామారావుకి కావలసింది దొరకలేదు. సరస్వతి విషయం అందులో లేనే లేదు.

మళ్ళా తిరిగి వచ్చేసరికి సరస్వతి గదిలో నిద్రపోతోంది.

నాలుగు రోజులలో రామారావుకి కావలసింది దొరకలేదు. భార్గవ ఇంట్లో ఉన్నంతసేపు సరస్వతి అతనినే అంటిపెట్టుకు ఉండేది. భార్గవతో ఏ విషయంలోనూ ఎక్కువగా మాటాడేదికాదు. భార్గవకు అన్నం వగైరాలు వడ్డించేప్పుడు వడ్డించి ప్రక్కకు తప్పుకొనేది.

బాత్‌రూములో స్నానానికి వెళ్ళేప్పుడు టవలు సోపు అందించి మళ్ళీ వెంటనే రామారావు దగ్గరకు వచ్చేసేది.

రోజూ ఉదయం రామారావు బయలుదేరే వేళకే భార్గవ ఆఫీసుకు వెళ్ళేవాడు. సాయంత్రం రామారావు వచ్చిన తరువాత చాలసేపటికి వచ్చేవాడు.

ఇవన్నీ గమనించుతున్న రామారావుకి కొంచెం, హాయిగా, తేలికగా ఉంది.

నాలుగు రోజులు పోయిన తరువాత భార్గవ సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన తరువాత అన్నాడు "ఆఫీసుకు దగ్గరలోనే నాకు గది దొరికింది. రేపు వెళ్తాను" అన్నాడు.

రామారావు వెంటనే అన్నాడు "మరో రెండు రోజులు పోయిన తరువాత వెళ్ళవచ్చు."

"ఇక్కడ ఉండి మిమ్మల్ని ఇబ్బంది పెట్టటం ?"

ఇందులో "ఇబ్బంది ఏముంది ? ఏమీలేదు అలా అనుకోకండి మీరు మా యింట్లో ఉంటే గౌరవంగానే భావించుతాము.".

భార్గర చిరునవ్వు నవ్వాడు.

ఆ రాత్రి పడుకోబోయే ముందు అంది సరస్వతి "ఎందుకు అతన్ని వెళ్ళనివ్వలేదు. వెళ్ళనివ్వక పోయారా ?"

"మరో రెండు రోజులున్న తరువాత వెళ్తాడులే"అన్నాడు రామారావ్.

"ఏమోబాబు.నాకు చాలా యిబ్బందిగా ఉంది, ఈ రెండు రోజులు ఎలా గడపాలో."

భార్గవపట్ల సరస్వతికి ఉన్న నిర్లిప్తక రామావు మనసులో ఒక రకమైన తృప్తి కలుగసాగింది. ఆతృప్తి వలన ఇపుడు కొంచెం ఆలోచించ గలుగుతున్నాడు. అతనికి యిపుడు సరస్వతిమీద కొంత గౌరవము - సానుభూతి, ప్రేమ యేర్పడసాగాయి.

మరునటి రోజు రామారావు

స్నానంచేస్తూ ఉండగా డ్రాయింగ్ రూంలోనుంచి మాటలు వినిపించాయి. రామారావు చెవులు పెద్దవిచేసి వినసాగాడు. సరస్వతి చెబుతుంది "ఈయనతో సంసారం నాకు చాల సుఖంగా వుంది. నేను చదువుకొనే రోజుల్లో నేను అనుకున్నట్టుగానే నేను కలలు కన్నట్లుగానే ఆయన దొరికాడు. చాల మందిలాగ మాకు డబ్బు లేకపోవచ్చుగాని చాల హాయిగా బ్రతుకుతున్నాము. ఆయనకోసం చచ్చిపోవటం అయినా నాకు యిష్టమే

ఆ మాటలు కొన్ని వేలసార్లు అతి సున్నితంగా తాకాయి రామారావుని. ప్రపంచంలోవున్న సంతోషం అంతా ఒక్కసారిగా లభించినట్టయింది. చాల వేగంగా స్నానం ముగించాడు. ఆరునెలల తరువాత ఆ రోజు అద్దం ముందు నిలబడి చాలనీటుగా ముస్తాబయ్యాడు. సరస్వతికి కావలసిన చిన్నచిన్న పనులు చేసిపెట్టాడు. భోజనం చేసి తనతోపాటు ఆఫీసుకు వెళ్ళుతున్న భార్గవమీద మొదటిసారిగా రామారావుకి జాలి కలిగింది.

భార్గవ తన ఆఫీసుకు విడిపోయిన తరువాత రామారావు అనుకున్నాడు "సరస్వతీ నీకు చాల అన్యాయం చేశాను. నిన్ను అర్థం చేసుకోలేకపోయాను. నిన్ను అనేక రకాలుగా బాధ పెటాను. నేను అనుమానం పక్షిని సరస్వతీ అనుమానం పక్షిని. అందుకనే భార్గవ పేరుతో ఉత్తరం వ్రాశాను. అది ఎవరో వ్రాశారనుకున్నావు కదూ నువ్వు - నేనే ఈ-రా స్కెల్ గా డే వ్రాశాడు. నన్ను క్షమించేసేయ్.

కొంచెం దూరం నడిచిన తరువాత రామారావుకి సిగరెట్ కాల్చాలనిపించింది. ఓ కిళ్ళీ బడ్డీలో సిగరెట్ వెలిగించుకొని కాల్చుకుంటూ కొంత దూరం నడిచి వెళ్లిన తరువాత ఇంకా అనుకున్నాడు. "ఈ దేశంలో పతివ్రతలకు చోటులేదు. పాతకాలంనుంచి పాపం వాళ్ళు అనేక బాధలు పడూనే ఉన్నారు. కారణం? తనలాంటి డెవిల్స్ ఉండబమే. ఒరేయ్ రామారావు-నీకు, రావణాసురుడికి - నరకాసురుడికి తేడా లేదు.

సరిగా అదే సమయంలో ఆఫీసుకు సగం దూరం వెళ్ళి వెనక్కి తిరిగి వచ్చిన భార్గవ రామారావు గదిలో ఉన్నాడు. తలుపులన్నీ గట్టిగా కరుచుకుని ఉన్నాయి. సరస్వతి తనకు భార్గవకు యింకా మధ్య ఖాళీగా ఉందేమోనని మరింత దగ్గరగా జరిగి అతని చుట్టూ రెండు చేతులు పెనవేసి నుదుటిమీద ముద్దుపెట్టుకుంటూ అంది "నన్ను మరచిపోతావా భార్గవా? నువ్వు మరచిపోతే నేను చచ్చిపోవటమే."

తరువాత ఆ పెదవులను భార్గవ మాటాడనివ్వలేదు. తన పెదవులతో ఆపివేశాడు.

రోజూ యిలాగే జరుగుతోందని రామారావుకి తెలియదు.

□●□

జ్యోతి